ప్రేమపాశంలో
చిక్కుకున్న
అతని జీవితంలో
కొత్తమలుపు?

కె.లక్ష్మి కథ

# ప్రేమ ఎంత మధురం

"ఈశిజిట్ వర్కింగ్?"

కనెక్షన్ దొరక్క పదోసారి డయల్ చేస్తున్న విజయ్ తలెత్తి ఆమాట వినిపించిన వైపు చూశాడు. కుందనపు బొమ్మలా వున్న యువతిని చూసి ఒక్క క్షణం మైమరచిపోయాడు. ఆమె అందానికి ముగ్ధుడై అలాగే చూస్తుండిపోయాడు.

ఆమె నొసలు చిట్లించి 'మాఫ్ కీజియే.. టెలిఫోన్ చల్తేహైనా?" అంది. ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు. 'జీ... చల్తాహై... ఆప్ హీ కోషిష్ కీజియే' అంటూ రిసీవర్ ఆమెకు అందించి ప్రక్కన నిల్చున్నాడు.

అది విక్టోరియా టెర్మినస్ స్టేషన్ అవటంతో జన సందోహం బాగా ఎక్కువగా వుంది. ఎలక్ట్రిక్ ట్రైన్లు "బొయ్... బొయ్..." మంటూ మోతపెడ్తున్నాయి.

కానీ ఇవేమీ విజయ్ దృష్టిని ఆకర్షించలేదు. తన్మయావస్థలో నాజూగ్గా నంబర్ డయల్ చేస్తున్న ఆమె వేళ్ళపైనుంచి అతని దృష్టంతా.

కనెక్షన్ దొరకలేదు. లైన్ కట్‌చేసి మళ్ళా డయల్ చేసింది.

"గుడ్‌గాడ్... సేమ్ నెంబర్!" అన్నాడు విజయ్ ఆశ్చర్యంగా.

ఆమె అతనివైపు ప్రశ్నార్థకంగా చూసింది. "మీరు డయల్ చేసింది మోహన్ నంబర్ కదూ..." అన్నాడు తెలుగులో. మనస్సులో మాత్రం అనేక ఆలోచనల్తో...

"యా... మోహన్ మీకు తెల్సా... మా అన్నయ్య" అంది ఆశ్చర్యంగా.

"బాగా తెల్సు... నా బెస్ట్ ఫ్రెండ్...



నేను ట్రై చేస్తున్నది అతని నంబర్‌కే... నాపేరు విజయ్'' నవ్వుతూ చెప్పాడు.

ఆమె సమాధానంగా తన పేరు చెప్పలేదు. ఆమె చూపులు మెయిన్ గేట్‌పై వున్నాయి.

విజయ్ కూడా ఓసారి గేట్‌వైపు చూసి ''ఇఫ్ యూ డోంట్ మైండ్... మోహన్ మిమ్మల్ని రిసీవ్ చేసుకోవటానికి స్టేషన్‌కి

రాలేదనుకుంటాను .ఎందువల్లో... మీకు అభ్యంతరం లేకపోతే నాకార్లో డ్రాప్ చేస్తాను ... రండి'' అన్నాడు.

ఎందుకూ... ఫర్వాలేదు. అన్నయ్య వస్తాడు. డాడీ నేను వస్తున్నట్లు వైరిచ్చారు'' అంది.

విజయ్ వాచ్ చూసి— "అరే! టైం రెండు అయింది. అంటే మీరు ట్రెయిన్ దిగి దాదాపు గంటనుండి వెయిట్ చేస్తున్నారన్నమాట. ఫర్వాలేదు రండి. నేను డ్రాప్ చేస్తాను'' అన్నాడు.

తను బొంబాయి రావటం ఇదే మొదటిసారి. హైదరాబాద్‌లో ట్రైన్ బయలుదేరే వరకూ డాడీ తనకు జాగ్రత్త... జాగ్రత్త ... ఒక్కదానివే బయల్దేరుతున్నావు'' అంటూ పదేపదే హెచ్చరిక చేశారు.

ఏం ఫర్వాలేదు డాడ్... నేనేమన్నా చిన్నపిల్లనా? అదీకాక అన్నయ్య నన్ను రిసీవ్ చేసుకోవటానికి ఎలాగూ స్టేషన్‌కు వస్తాడు కదా?'' అని ధైర్యం చెప్పింది.

తీరా ఇక్కడికి వస్తే అన్నయ్య స్టేషన్‌కి రాలేదు. ఈ అపరిచిత వ్యక్తి ఏమో అన్నయ్య తన ఫ్రెండ్... డ్రాప్ చేస్తానురా అంటున్నాడు...

ఏమిటి ఆలోచిస్తున్నారు. నన్ను అనుమానిస్తున్నారా? సరే మీ వదినగారి పేరు సుజాత. మీ మేనల్లుడి పేరు రవి. మీ అన్నయ్య పనిచేసే కంపెనీ... అని నవ్వుతూ వరుసగా కారు నెంబర్... ఇంటినెంబర్ మొదలైన వివరాలు అన్నీ చెప్పడం మొదలు పెట్టాడు.

నవ్వుతున్న ఆ కళ్ళల్లో కనబడుతున్న నిజాయితీని గమనించి 'ఓకే. పదండి'' అన్నది నవ్వుతూ.

"థాంక్యూ''— అని ఆమె చేతిలోని సూట్‌కేస్ అందుకుని ముందుకు నడిచాడు ఆమె అతన్ని అనుసరించింది.

గ్రే కలర్ సూట్‌లో నిండుగా, హుందాగా తన ముందు నడుస్తున్న ఆజానుబాహుడి విగ్రహాన్ని ఆమె హృదయంలో చిత్రంగా దాచుకుంది.

పార్కింగ్ ప్లేస్‌లోవున్న తన తెల్లటి ఫియెట్ కారు దగ్గరికి నడిచాడు. వెనుక డోర్ తెరచి సూట్‌కేస్ సీట్‌పై పెట్టి "కూర్చోండి'' అని ఆమె కూర్చున్నాక డోర్ వేసి తను డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు.

ఇరవై నిముషాల్లో ట్రాంబే రోడ్డులో వున్న ఇంటిలోకి ప్రవేశించింది కారు. గేటుకు తగిలించి వున్న నేమ్ ప్లేట్ చూసి "హమ్మయ్య''అనుకుంది.

కారు ఆగగానే లోపల్నుంచి నౌకరువచ్చి 'అయ్యగారింట్లోనే వున్నారు' అన్నాడు ఇద్దరూ ఇంట్లోకి నడిచారు.

హాల్లో సోఫాలో కూర్చున్న మోహన్ విజయ్ ని చూసి నవ్వి అతని వెనుకే వస్తున్న చెల్లెల్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏమిటీ ఆలోచిస్తున్నావ్? మీ చెల్లెలు వస్తున్నట్లు టెలిగ్రాం అందలేదా?' విజయ్ మాటలకి "వచ్చింది... కానీ...'' అంటూ తలకొట్టుకున్నాడు.

"అంటే టెలిగ్రాం అందే నువ్వు స్టేషన్‌కి రాలేదా'' కోపంగా పక్కిందామె.

"హోల్డాన్... హోల్డాన్...'' అంటూ

ఫాంట్‌లో చేయి పోనిచ్చి పెర్రిగ్గాం చూశాడు. రెండుసార్లు పరీక్షగా చూసి ఆమె చేతికిచ్చాడు.

అదిచూసి "ఇదేమిటీ—" అందామె ఆశ్చర్యంగా.

"అదే నేమా అడుగుతుందీ" అన్నాడు మోహన్.

"ఏమిటీ"— అని అడిగాడు విజయ్ సోఫాలో కూర్చుంటూ.

"మా మేనేజర్‌గారు పొరపాటున నేను రేపు వస్తున్నట్లు వైరిచ్చారు"—

సమయానికి మీరు వచ్చారు కాబట్టి బ్రతికాము. లేకపోతే ఈ మహానగరంలో ఈ ఇంటి కోసం ఎన్ని అవస్థలు పడాల్సి వచ్చేదో—" అందామె జరిగిన విషయం అన్నకి వివరిస్తూ.

"థాంక్స్ విజయ్ "— కృతజ్ఞతగా అన్నాడు మోహన్.

పెదవి విరుస్తూ సీరియస్‌గా "ప్చ్... నాకక్కర్లేదు". అన్నాడు.

"ఏం"— మోహన్ ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు.

"ఏం? ఏంటిరా? మీ చెల్లెలికి నా పేరు చెప్పి పరిచయం చేసుకున్నాను. గంట అయింది. తను పేరు చెప్పలేదు. కనీసం నువ్వు పేరు పెట్టి పిలిస్తే విని తెల్సుకుందాం అంటే నువ్వేమో... ఇంతవరకూ పిలవలేదు " అన్నాడు నవ్వుతూ.


"ఓ... ఐయామ్‌సారీ... నాపేరు పూజ..." అంది సిగ్గుగా నవ్వుతూ.

"వదినేదన్నయ్యా" అంది.

"రవికి కాన్వెంట్ డ్రస్ కావాలంటే రవిని తీసుకుని వెళ్ళింది. వచ్చేస్తుంది. పదా భోం చేద్దువు నువ్వు... నువ్వు కూడా విజయ్ " అన్నాడు మోహన్ లేస్తూ.

"లేదు మోహన్. నాకు పనుంది. వస్తాను పూజగారూ" అంటూ వెళ్ళిపోయాడు.

భోజనం చేస్తున్న చెల్లెలి ప్రక్కనే కూర్చుని "ఏంటమ్మా విశేషాలు. డాడీ



కులాసాగా వున్నారా?'' అడిగాడు.

''పరీక్షలు బాగానే రాశాను. ఫస్ట్‌క్లాస్ రావచ్చు—'' అంది నవ్వుతూ.

మోహన్ మనస్సు తండ్రి రాసిన ఉత్తరం గురించి ఆలోచిస్తుంది. పెళ్ళి చేసుకోనని మొండిపట్టు పడ్తున్న పూజని పెళ్ళికి అంగీకరించేలా చేయమని తండ్రి రాశాడు.

''మరి తర్వాత ఏం చేద్దామనుకుంటు న్నావు'' తను చెప్పబోయే విషయానికి ఒక రూపం ఏర్పాటు మనస్సులో చేసుకుంటూ అడిగాడు.

''ఏముందీ ఎం.ఎ చదువుతాను'' అంది స్థిరంగా.

''చూడు పూజా. ఎం.ఎ చదవచ్చు. అది చాలా సాధారణ విషయం. కానీ పెద్దవాళ్ళకీ కొన్ని బాధ్యతలున్నాయని... అవి నెరవేర్చే బాధ్యతా వుందని మర్చిపోకూ డదు''

''నువ్వేమంటున్నావన్నయ్యా'' అంది అర్థంకాక.

''అవునమ్మా... నాన్నగారు లెటర్ రాశారు. ఆయన చూసిన డాక్టర్ నీకు నచ్చకపోతే చెప్పు... ఇంకొకరు ఎవరైనా...''

''అదేం లేదన్నయ్యా'' తడబడింది. చెల్లి దీనవదనం చూసి ఇప్పుడే వచ్చిన చెల్లెల్ని బాధపెట్టడం భావ్యం కాదని ఆ విషయం ఆపేశాడు.

సుజాత ఇంటికిరాంగానే పూజని చూసి మోహన్‌లానే ఆశ్చర్యపోయింది. ''పైకి వెళ్ళి కాస్సేపు పడుకో''— అంది.

సాయంత్రం పిక్చర్ ప్రోగ్రాం వేశారు మోహన్ సుజాతలు. కారు ఒక కొత్త థియేటర్ పోర్టికోలో ఆగింది.

''హల్లో...'' అంటూ కారు దగ్గరికి వచ్చాడు విజయ్.

పాము కుబుసం లాంటి తెల్లటి చీరలో, నల్లని విరబోసిన కురులమధ్య చంద్రబింబం లా ప్రశాంతంగా వున్న ఆమె పోతపోసిన వెన్నెల్లాంటి ఆమె రూపానికి ముగ్ధుడైపోయా డు విజయ్. ఆపాదమస్తకం ఆరాధనా పూర్వకంగా చూస్తున్న అతని కళ్ళు ఒక్క క్షణం ఆమె కళ్లతో కలిసినాయి.

''అంకుల్... పిక్చర్ బిగిన్ అయిందా'' రవి చెయ్యి పట్టి లాగటంతో ఈ లోకంలోకి వచ్చి రవిని ఎత్తుకుని ''నువ్వు రాకుండా బిగిన్ అవుతుందా'' అంటూ ముందుకు నడిచాడు.

విజయ్ బాక్స్ దగ్గరికి రాగానే గేట్ కీపర్ వినయంగా తలుపులు తీశాడు. మోహన్, సుజాత, పూజా కూర్చోగానే రవిని సుజాతకిస్తూ ''మళ్ళీ వస్తాను'' అంటూ బయటికి వెళ్ళాడు విజయ్.

''వదినా టికెట్స్ ముందే రిజర్వ్ చేయించారా'' పూజ అడిగింది.

''లేదు... ఈహోలు విజయ్ ది. మన తెలుగువాడే. మేం బొంబే వచ్చిన ఈ రెండేళ్ళలో మాతో బాగా కల్సిపోయాడు. మధ్యాహ్నం నువ్వు నిద్రపోతున్నావ్... ఫోన్ చేసి పిక్చర్‌కి రమ్మని చెప్పాడు. మీ అన్నయ్యకి హోలీడే. అందుకే అంగీకరించారు'' అంది. పిక్చర్ మొదలౌతుండగా విజయ్ వచ్చి మోహన్ ప్రక్కన కూర్చున్నాడు.

పిక్చర్ అయిపోగానే కారుదాకా వచ్చి మోహన్ "గుడ్‌నైట్" చెప్పి వెళ్ళాడు విజయ్. దారిలో కార్లో మోహన్ విజయ్ గురించి అతన్ని మెచ్చుకుంటూ పొగడుతూ మాట్లాడ్తుంటే పూజ మౌనంగా వింటుంది

బెడ్‌మీద వాలి నిద్రపోదామని ప్రయత్నించింది పూజ. మాటిమాటికీ హాలులో విజయ్ తన్నుచూపిన చూపులు గుర్తుకొచ్చాయి. విజయ్ తనని బాగా ఆకర్షించాడు. ప్రశాంతంగా ఉండే ముఖం. ఎప్పుడూ నవ్వుతూ వుండే పెదవులు. ఆకర్షణీయంగా వుండే కళ్ళు, విజయ్ లాంటి వ్యక్తిని చేసుకోమంటే తను కాదనగలదా?" ఆలోచనకి ఉలిక్కిపడింది.

మరుసటిరోజు సాయంత్రం తన ఫియెట్‌లోంచి దిగాడు విజయ్. సోఫాలో కూర్చున్న పూజని చూసి 'నమస్తే' అన్నాడు.

'రండి... కూర్చోండి' ఎదురు సోఫాలో కూర్చున్నాడు.

సుజాత లోపల్నుంచి వచ్చింది.

"మోహన్ వచ్చేసరికి ఎనిమిది అవుతుందిట. మిమ్మల్ని ఎక్కడైనా షికారుకి తీసుకెళ్ళమని నాకు ఫోన్ చేసి చెప్పాడు"— అన్నాడు సుజాతతో.

సుజాత ఒక్క క్షణం ఆలోచించి "రవి ఇంకా రాలేదు. వాయర్ కూడా ఈరోజు శలవు పెట్టాడు. పోనీ... మీరిద్దరూ వెళ్ళిరండి" అంది సుజాత.

విజయ్ పూజ వేపు చూశాడు సమాధానం కోసం.

మోహన్‌కి సుజాతకి అతనిమీద వున్న సదభిప్రాయం ఆమెను బయల్దేరదీసింది.

కారు జూహూ బీచ్‌లో ఆగింది. బొంబేలోని జనం రద్దీ గురించి, సినిమాల గురించి, కాలేజీ గురించి మొదలైన విషయాలు మాట్లాడుకుంటూ అటూఇటూ తిరిగారు. బీచ్ స్టాల్‌లో పానీపూరీ తిని కొబ్బరి బోండాలు తాగారు.

దాదాపు ఎనిమిది గంటల వరకూ తిరిగి ఇంటికొచ్చారు. అప్పటికే మోహన్ ఇంటికి వచ్చివున్నాడు. మోహన్ సుజాతల బలవంతం మీద అక్కడే భోంచేసి వెళ్ళాడు విజయ్.

ఆ మర్నాడు కూడా విజయ్ వచ్చాడు



## అభయం

ఆపరేషన్ చేసి బయటకొచ్చిన డాక్టర్ వైకుంఠం పేషెంట్ ఫామిలీతో చెప్పాడు—

"మీరేం కంగారుపడకండి. భయపడాల్సిందేం లేదు. మనిషిపోయాడు. కాని, ధైర్యంగా లోపలికెళ్ళి చూడండి" చేతికున్న గ్లౌస్‌ను రిమూవ్ చేసుకుంటూ తాపీగా చెప్పాడు.

—దిగువ హరినాథ్ (వరంగల్)

పిటీ చూపించటానికి. ఆవిధంగా వారం రోజులు పూజ బోంబేలో చూడాల్సిన ప్రదేశాల్ని చూపించాడు. అతను మాట్లాడే తీరు సభ్యతాయుతమైన అతని ప్రవర్తన సంస్కారయుతమైన అతని మనస్తత్వం ఆమె ను ముగ్ధురాల్ని చేశాయి.

ఆరోజు సాయంత్రం "గేట్ వే ఆఫ్ ఇండియా" దగ్గర సిమెంట్ బెంచీపై కూర్చున్నారు. సముద్రపు అలలు ఎత్తయిన బండరాళ్ళను కొట్టుకుని ఎగిరి పడుతున్నాయి. సూర్యుడు పడమటి దిక్కును రాగరంజితం చేస్తున్నాడు.

"పూజా"

"ఊ" అంది నెమ్మదిగా.

"నువ్వు ఏమీ అనుకోనంటే ఒకమాట అడుగుతాను"

"అడగండి" నవ్వుతూ అంది.

"నేను అడగబోయే విషయంలో నీ అభిప్రాయం నాకు చాలా విలువ అయింది. ఫలితం ఏదైనా మన స్నేహం ఇలాగే వుంటుందని మాట ఇవ్వు" అంటూ చేయి చాపాడు. ఒక్క క్షణం సంశయించి చేతిలో చేయివేసింది.

"పూజా! కల్సిన ఈ చేతులు జీవితాంతం ఇలాగే వుండాలని నా కోర్కె. ఐ లవ్ యు. నీ కిష్టం అయితే మీ అన్నయ్యతో మాట్లాడతాను" అన్నాడు.

ఆనందం సముద్రంలో ఆమె హృదయమ్ము లో పొంగింది. ఆ సాయం సంధ్యలో సిగ్గుతో ఎర్రబడ్డ ఆమె చెక్కిళ్ళు కొత్త వెలుగులు నింపుకున్నాయి.

"అన్నయ్యతో మాట్లాడండి" అంది చెయ్యి తీసుకుంటూ.

"థాంక్యూ పూజా... థాంక్యూ వెరీమ చ్. రేపు సాయంకాలం మీ ఇంటికొచ్చి నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడతాను. ఆ తర్వాత మీ అన్నయ్యతో మన విషయం మాట్లాడతాను" అన్నాడు.

సుజాత ఎంత బలవంతం చేసినా భోజనం వద్దని వెళ్ళిపోయాడు విజయ్. భోజనం సమయంలో విజయ్ విషయం చెద్దామనుకొని ఎందుకులే అతనే చెప్తాడన్నా దుగా అని మౌనంగా వుండిపోయింది పూజ.

మర్నాడు సాయంత్రం విజయ్ వాళ్ళ వర్కర్ ఒకతను వచ్చి అతని కోసం గార్డెన్‌లో తిరుగుతున్న పూజకు కవర్ ఇచ్చి వెళ్ళాడు.

కవర్ చించి లెటర్ చదివింది.

"పూజా!"

జీవితం అనేది మనిషి చేతుల్లో వుండటం అసాధ్యం. పరిస్థితులకూ, సంఘటనలకూ అనుకూలంగా జీవితం తను మారి ఆ జీవిని కూడా నడిపిస్తుంది. మాది విజయవాడ. నాన్నా అన్న పిలుపు నానోటితో పల్కక ముందే నాన్న పోయారు. నాకు మిగిలింది అమ్మ. నన్ను ఎంతో కష్టపడి ఎం.ఎ చదివించింది. నేను ఎం.ఎ పరీక్షలు రాసి ఇంటికొచ్చేప్పటికి నా ప్రత్యక్ష దైవం... మా అమ్మ నన్ను వదిలి శాశ్వతంగా వెళ్ళిపోయిం ది.

అప్పులవాళ్ళు ఆ చిన్న ఇల్లు స్వాధీన పర్చుకోగా... కాలే కడుపుతో బయటపడ్డా ను. బల్ల క్రింద బరువైన కవరుగాని,

బలమైన రికమండేషనుగాని లేని నాలాంటి వాడికి ఉద్యోగం ఎవరిస్తారూ? అపుడన్పించింది ఎక్కువగా చదువుకోవడం కూడా తప్పేనని. దహించి వేసే ఆకలి బాధనుండి తప్పుకోలేని అపర స్థితిలో కార్పొరేషన్ నీళ్ళతో కడుపు నింపుకొని ఫుట్‌పాత్‌మీద నివసిస్తున్న పరిస్థితుల్లో అనుకోకుండా ఒక స్మగ్లింగ్ ముఠాతో కల్సాను. బొంబాయి వచ్చాను.

నా పట్టుదల, కార్యదీక్ష, శక్తి—యుక్తి అన్నీ డబ్బు సంపాదనా లక్ష్యంవైపు కృషిచేశాయి. ఫలితంగా నాల్గు సంవత్సరాల్లోనే నలభై లక్షలు చేసే సినిమాహాలు, బ్యాంక్ బ్యాలెన్స్, కారు, ఇల్లు, హోదా అన్నీ సంపాదించాను. కానీ పూజా... ఆరోజు నిన్ను మొదటిసారి చూసిన రోజే ప్రేమ అనే పాశం నన్ను బంధించింది. నీ ఆరాధనలో క్రొత్త జీవితం ప్రారంభించాలనుకున్నాను.

చేసిన నేరాలకు ప్రాయశ్చిత్తంగా ప్రభుత్వానికి లొంగిపోయి చీకటి ముసుగులోంచి వెలుగులోకి రావాలనుకుంటున్నాను. నిన్ననే ఈ నిజం నీతో చెబ్దామనుకున్నాను. కనీసం ఈరోజుకూడా ధైర్యం చాలలేదు. అందుకే ఈ ఉత్తరం పంపుతున్నాను.

పూజా! నీ కోపం నా గత జీవితానికి సమాధి కడతాను. శిక్ష అనుభవిస్తాను. మారిన మనిషిని స్వీకరించగల మనో నిబ్బరం నీకుంటే... ఈ రాత్రి రెండు గంటలకు సినిమాహాల్లో ఫోన్ దగ్గరే ఎదురు చూస్తుంటాను. నీ కిష్టమైతే ఫోన్‌చేసి చెప్పు. నీ దగ్గరినుండి ఫోన్‌కాల్ రాకపోతే— నా బాడ్‌లక్...

—విజయ్

ఉత్తరం చదివిన పూజ కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి. ఏమిటి తనకీ విషమ పరీక్ష. ఒక నేరస్తుడినా తను ప్రేమించింది? అతను చేసిన నేరానికి శిక్ష అనుభవించిన తరువాత అయినా తను అతన్ని స్వీకరించగలదా? అందుకు అడ్డంకులు ఏమి వుండవా? అతను ఈ నిజం దాచి పెళ్ళి అయిన తర్వాత చెప్పివుంటే ఏం చేసేది తను. విజయ్ నిజమైన వ్యక్తిత్వం కలవాడు కావడం




## తల్లిలాంటి వెల్లుల్లి

ఆరువేల సంవత్సరాల నుంచి మానవాళిని తల్లిలా కాపాడే అద్భుత అమృతం వెల్లుల్లి! వెల్లుల్లి ఉబ్బసం, మధుమేహం, విరోచనాలు, కేన్సర్‌వంటి 32 భయంకర వ్యాధుల్ని తగ్గించగలదని పరిశోధనలు చెప్తున్నాయి!

అందుకే చాలా మంది వెల్లుల్లిని ప్రతిరోజూ తమ ఆహారంలోపాటు తీసికొంటారు! ముఖ్యంగా ప్రతిరోజూ పచ్చి వెల్లుల్లిని తినేవారు చాలా ఆరోగ్యంగా ఉంటారు! మరింకేం! మీరు కూడా మొదలు పెట్టండి!

—జూపిటర్

తో ముందే చెప్పాడు.

అలాంటి మంచి మనిషి కోసం ప్రేమించి వెనుకకి అడుగువెయ్యకూడదు" అని అంతరాత్మ హెచ్చరించింది ఆమెను.

"అవును అతని కోసం నేనేమైనా ఫర్వాలేదు" అనుకొని ఫోన్ చేయాలని వేగంగా క్రిందికి రాబోయింది. క్రింద అన్నావదిన సంభాషణ ఆమెను మెట్లమీదే ఆపేసింది.

"విజయ్ ఇంట్లో దొంగ బంగారం దొరికిందట. అతని ముఠాలోని కొంతమంది వ్యక్తుల్ని పట్టుకున్నారట పోలీసులు. అందరూ నేరాన్ని ఒప్పుకున్నారట ఒక్క విజయ్ తప్ప" అంటున్నాడు మోహన్.

"మరి విజయ్ ఏమంటున్నాడు" కుతూహలంగా అడిగింది సుజాత.

"అనటానికేముంది. తనింట్లో దొరికితే తనేగా బాధ్యుడు. ఈ రాత్రి రెండు గంటల వరకూ ఏ స్టేట్‌మెంట్ ఇవ్వనని, తనకేదో ముఖ్యమైన ఫోన్‌కాల్ రావాలని, అప్పటివరకూ వెయిట్ చేయమని పోలీసుల్ని రిక్వెస్ట్ చేశాడట. వాళ్ళు ఒప్పుకున్నారు" విచారంగా అన్నాడు.

"ఇంకా నయం ముందుగానే బయటపడింది. నేనింకా పూజని అడగాలనుకున్నాను" అంది సుజాత.

"నేనూ నాన్నగార్ని పిలిపించి మాట్లాడుదామనుకున్నాను" అన్నాడు.

"పూజకి ఈ విషయాలేమీ తెలియనివ్వకు" అన్నాడు నిట్టూరుస్తూ.

"అలాగే" లోపలి గదిలోకి నడిచారు మోహన్, సుజాతలు.

బొమ్మలా నిల్చున్న పూజలో చలనం లేదు. ఏ నిశ్చయానికీ రాలేకపోయింది. కళ్ళముందు కల్మషంలేని విజయ్ రూపం.

పూజనుంచి ఫోన్ కోసం రెండు గంటల వరకూ ఫోన్ దగ్గరే వేచివున్న విజయ్ ఫోన్ రాకపోయేసరికి "వెరీ సారీ ఇన్‌స్పెక్టర్... పదండి" అన్నాడు వాళ్ళని అనుసరించి ముందుకు నడుస్తూ.

పూజ ఫోన్ చేయనందుకు మనస్సు కుంచుకుపోయే బాధ... బ్రతకటం వేస్ట్ అన్న ఫీలింగ్ మనిషి మొత్తాన్నీ తాకి అతన్ని వణికేలా చేస్తుంది.

పోలీస్ జీప్‌లో కాలుపెట్టబోతున్నాడు. గదిలో ఫోన్ మ్రోగింది. ఒక్క అంగలో గెంతి లోపలికి నడిచాడు.

"హల్లో"— టెన్షన్‌గా పలికాడు.

"నేను... పూజని... నీ పూజని విజయ్ ... కేవలం నీ కోసమే పూసిన పూవుని... నిన్ను అందరికోసం వదులుకోలేను. నీ కోసం అందరినీ వదిలి నేనే వస్తున్నాను. ఎందుకో తెల్సా... నా రాక నీ జీవితం క్రొత్త మార్గాన్ని తొక్కుతుందని. నీవల్ల చెడ్డ కాదు, మంచి జరుగుతుందని ఆకాంక్షిస్తూ నీ జీవితంలో ప్రవేశించాలని ఉత్సాహంతో నీ కోసం వస్తున్నాను" పూజ గొంతు వింటూనే తన్మయత్వంతో కళ్ళు మూసుకున్నాడు. అప్పుడు ఆ కళ్ళనుంచి నీళ్ళు క్రిందికి నెమ్మదిగా జారాయి. *